క్లుప్తంగా

బండ్రేవులో వికసిత్ భారత్ సంకల్ప యాత్ర

పెద్దమండ్యం: మండలంలోని బండ్రేవు, మండలవారిపల్లె గ్రామాలలో సోమవారం వికసిత్ భారత్ సంకల్పయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సచివాలయం వద్ద ఆర్థిక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ద్వారా అమలవుతున్న పథకాలను అధికారులు వివరించారు. ఆయా శాఖల ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా చేపడుతున్న పథకాలు, వాటి లబ్ధి గురించి తెలియజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గౌరీశంకర్, ఎంపీడీఓ శ్రీధర్‌రావు, ఈవోపీఆర్‌డీ జనార్ధన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ హరిప్రసాద్, ఏపీవో మురళి, సర్పంచ్ పీరాన్‌బి, రైతులు పాల్గొన్నారు.

సారా విక్రేత అరెస్ట్

నిమ్మనపల్లె : అక్రమంగా సారా విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామకృష్ణ తెలిపారు. సోమవారం మండలపరిధిలోని బండ్లపై గ్రామంలో సారా విక్రయాలు జరుగుతున్నట్లు సమాచారం అందడంతో దాడిచేసి స్థానికుడైన దొరబాబు(44)ను అదుపులోకి తీసుకుని, అతడివద్ద నుంచి 15లీటర్ల సారా స్వాధీనం చేసుకుని సీజ్ చేశామన్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

కలకడ : అక్రమంగా మద్యం నిల్వ ఉంచి విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసి అతని వద్ద ఉన్న 15 క్వార్టర్ బాటిళ్లను సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. ఎస్‌ఐ కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆదివారం రాత్రి మండలంలోని కదిరాయచెర్వు గ్రామానికి చెందిన లక్ష్మీపతి వద్ద అక్రమంగా మద్యం ఉన్నట్లు అందిన రహస్య సమాచారం మేరకు తన సిబ్బందితో దాడి చేశారు. మద్యం బాటిళ్ళు సీజ్ చేసి సోమవారం కేసు నమోదు చేసినటు తెలిపారు.

మల్లయ్యకొండపై భక్తుల సందడి

తంబళ్లపల్లె: మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి ప్రతి సోమవారం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తున్నారు. సుదూర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారి దర్శనం చేసుకుంటున్నారు. మల్లికార్జున, ఈశ్వరప్పలు స్వామికి ప్రత్యేక అలంకరణతో పాటు అభిషేకాలు, పూజలు చేసి భక్తులకు దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. అలాగే గౌరమ్మగట్టులోని గౌరీదేవికి పూజారి శేఖర్ ప్రత్యేక అలంకరణతో పూజలు చేశారు. మహిళా భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయకమిటీ చైర్మన్ మల్‌రెడ్డి,ఈవో రమణ, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. దేవస్థానం ఆధ్వర్యంలో అన్నసంతర్పణ చేశారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేస్తున్న నాయకులు

బి.కొత్తకోట: సీఎం సహయ నిధి నుంచి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి మంజూరు చేయించిన చెక్కును సోమవారం వైఎస్సార్ సీపీ నాయకులు అందజేశారు. మండలంలోని గట్టుకు చెందిన షబ్రున్నీసా అనారోగ్యంతో ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంది. నిరుపేదరాలు కావడంతో ఎమ్మెల్యే స్పందించి ఆమె సీఎం సహాయనిధి నుంచి రూ.1.30 లక్షలు మంజూరు చేయించారు. ఈ చెక్కును నాయకులు బుద్దల వెంకటరెడ్డి, మియాసాబ్, లక్ష్మీనారాయణ, తన్వీనర్ తదితరులు అందజేశారు. దీనిపై షబ్రున్నీసా ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

ఆడుదాం ఆంధ్ర పోటీలు విజయవంతం చేయాలి

తంబళ్లపల్లె: ప్రభుత్వం చేపట్టిన ఆడుదాం–ఆంధ్ర ఆటల పోటీలు మండల స్థాయిలో విజయవంతం చేయాలని ఎంపీడీఓ సురేంద్రనాథ్ కోరారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఆటల పోటీల నిర్వహణపై వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 20వ వరకు పోటీలు నిర్వహించాలన్నారు. 29, 30వ తేదీలలో నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు జరుగుతాయన్నారు. సమావేశంలో పీడీ మొగల్‌ఖాదర్‌బాషా, పీఈటీలు లతా, చలపతిరెడ్డి, దేశ్‌ముఖ్‌లు పాల్గొన్నారు.

రేపటి నుంచి మండలస్థాయి ‘ఆడుదాం ఆంధ్ర’

కేవీపల్లె : మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు బుధవారం నుంచి నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఉపేంద్రరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ గ్రామస్థాయిలో ప్రతి చూపిన క్రీడాకారులు మండల స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. బుధవారం, గురువారం రెండు రోజుల పాటు కేవీపల్లె జెడ్పీ ఉన్నత పాఠశాలలో కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్ పోటీలు, గ్యారంపల్లె ఏపీఆర్ జూనియర్ కళాశాలలో క్రికెట్ పోటీలు జరుగుతాయని చెప్పారు. అలాగే ఈ నెల 19, 20వ తేదీలలో వగళ్ల కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయంలో మహిళలు ఆడే ఆటల పోటీలు జరుగుతాయని తెలిపారు.

ఆకట్టుకున్న ముందస్తు సంక్రాంతి సంబరాలు





రామసముద్రం: మోడల్‌స్కూల్‌లో ముగ్గులు వేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలుపుతున్న విద్యార్థులు , భోగిమంట వేసిన విద్యార్థులు

రామసముద్రం: మండలంలోని దిన్నిపల్లి సమీపంలోని ఆదర్శ పాఠశాలలో సోమవారం ఘనంగా ముందస్తు సంక్రాంతి పండుగ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సంక్రాంతి ప్రాముఖ్యతను తెలపాలన్న ఉద్దేశంతో ప్రిన్సిపాల్ మునస్వామినాయక్ , విద్యార్థులు, ఉపాధ్యాయులు సంప్రదాయ తెలుగుదనం ఉట్టిపడేలా దుస్తులు ధరించి పండుగను జరుపుకున్నారు. విద్యార్థులు చేత భోగిమంటలు , ముగ్గులపోటీలు , గాలిపటాలు ఎగరవేయించారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మకర సంక్రాంతి పండుగను ప్రతి సంవత్సరం పాఠశాలలో ఘనంగా జరుపుకొంటామని తెలిపారు. సంక్రాంతి గొప్ప భారతీయ సంస్కృతిక పండుగని , తెలుగువారు ముఖ్యంగా జరుపుకొనే పెద్ద పండుగ సంక్రాంతి అన్నారు. అనంతరం విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. సంక్రాంతి సంబరాల్లో అధ్యాపకులు నాగరాజ, పాఠశాల చైర్మన్ గుణశేఖర్, ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు , విద్యార్థులు పాల్గొన్నారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి

వాల్మీకిపురం: సమాజంలో రోజురోజుకు అంతరించిపోతున్న సంప్రదాయాలను మనమే కాపాడుకోవాలని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం బాలాజీ అన్నారు. సోమవారం మండలంలోని ప్యారంపల్లి పాఠశాలలో ముందస్తు సంక్రాంతి, భోగి పండగలను నిర్వహించి, విద్యార్థులకు సంప్రదాయ పద్ధతులపై అవగాహన కల్పించారు. కట్టు, బొట్టు, నడవడికలకు పెద్దపీట వేస్తూ విద్యార్థులకు అవగాహన కల్పించారు. మన పూర్వీకుల పద్ధతులను మనం పాటించినప్పుడు మన విలువలను కాపాడుకోగలుగుతామన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్రాంతి ముగ్గుల పోటీలు

తంబళ్లపల్లె: మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా మోడల్ స్కూళ్లలో సోమవారం బాలికలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. తంబళ్లపల్లె ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోటీలు జరిగాయి. నిరుపమ, దీపిక, సరూప్య, దివ్యశ్రీలు వేసిన ముగ్గులు ఎంతో ఆకర్షణీయంగా ఉండడంతో బహుమతులకు ఎంపిక చేశారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్‌లో సంక్రాంతి సందడి



వాల్మీకిపురం: సంప్రదాయ దుస్తుల్లో విద్యార్థులు

పెద్దతిప్పసముద్రం: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 9 నుంచి సంక్రాంతి శెలవులు ప్రకటించారు. ఈ నేపథ్యంలో ముందు రోజు స్థానిక మోడల్ స్కూల్‌లో సంక్రాంతి పండుగ సందడి నెలకొంది. సోమవారం విద్యార్థులు సంప్రదాయ దుస్తులతో పాఠశాలల ఆవరణంలో ముగ్గులు వేశారు. భోగ భాగ్యాలనిచ్చే భోగి, సరదానిచ్చే సంక్రాంతి, కమ్మని కనుమ పండుగ అందరి జీవితాల్లో కొత్త వెలుగులు నింపాలని ఆకాంక్షిస్తూ భోగి మంటలు వేసి సరదాగా సందడి చేశారు.

బ్యాడ్మింటన్ విజేతకు మంత్రి పెద్దిరెడ్డి అభినందనలు



బ్యాడ్మింటన్ విజేత హోత్రిశ్రీని అభినందిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పీలేరు : రెండు రోజుల క్రితం అనంపురంలో జరిగిన స్పోర్ట్స్, గేమ్స్ మీట్‌లో 26వ ఇంటర్ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలో రాష్ట్ర స్థాయి విజేతగా నిలిచిన పీలేరుకు చెందిన హోత్రిశ్రీపై రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అభినందనలు తెలిపారు. సోమవారం తిరుపతి బ్యాడ్మింటన్ క్రీడాకారిణి హోత్రిశ్రీ తోపాటు ఆమె తండ్రి బ్యాడ్మింటన్ కోచ్ ప్రభాకర్‌రెడ్డి మంత్రిని కలిశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పీలేరు క్రీడాకారిణి రాష్ట్ర స్థాయి విజేతగా నిలవడం అభినందనీయమన్నారు. భవిష్యత్తు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో షటిల్ బ్యాడ్మింటన్‌లో రాణించాలని ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించడానికి చిత్తశుద్ధితో పని చేస్తోందని తెలిపారు. అందులో భాగంగానే ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కోచ్ ప్రభాకర్‌రెడ్డి మాట్లాడతూ పీలేరులో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేయడానికి ప్రభుత్వం తరపు స్థలం కేటాయించాలని మంత్రికి విన్నవించారు.

సచివాలయ వ్యవస్థతో గ్రామ స్వరాజ్యం

- నాలుగన్నరేళ్ల పాలనలో విప్లవాత్మక మార్పులు
- ప్రతి గ్రామంలోనూ కోట్ల రూపాయల భవనాలు
- పేదల పక్షపాతిసీఎం వైఎస్.జగన్
- ఎమ్మెల్యే నవాజ్‌బాషా



కొండామారిపల్లెలో గ్రామ సచివాలయ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా

మదనపల్లె : మహాత్మాగాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్యం సాకారం కావాలన్న తపనతోనే గ్రామ సచివాలయ వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువచ్చారని ఎమ్మెల్యే నవాజ్‌బాషా అన్నారు. మండలంలోని పెంచుపాడు, కోటవారిపల్లె, కొళ్లబైలు, కొత్తవారిపల్లె-2(దుబ్బిగానిపల్లె), కొత్తవారిపల్లె-1, పోతబోలు, కొండామారిపల్లెల్లో రూ.2.18 కోట్లతో నిర్మించిన 5 గ్రామసచివాలయాలు, రూ.95.76లక్షలతో నిర్మించిన 4 రైతుభరోసా కేంద్రాలు, రూ.87.20లక్షలతో నిర్మించిన 4 వెల్‌నెస్ సెంటర్‌లను సోమవారం ఎమ్మెల్యే నవాజ్‌బాషా ఆయా పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీలు, స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వశాఖల సేవలు, సంక్షేమ సేవలను ఒకేచోట అందుబాటులో ఉంచడం ద్వారా పరిపాలనను ప్రజలకు చేరువ చేశారన్నారు. దేశంలో మరెక్కడా ఇలాంటి సేవలు లేవని, గ్రామ సచివాలయ వ్యవస్థ పాలనలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి గ్రామంలోనూ రూ.కోట్ల వ్యయంతో ప్రజలకు సచివాలయం, రైతుభరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్ అందుబాటులోకి తేవడం జరిగిందన్నారు. గత ప్రభుత్వాల్లో ఏ పనులు కావాలన్నా గ్రామాలకు దూరంగా మండల, రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేదన్నారు. నేడు జగనన్న ప్రభుత్వంలో ఇంటి వద్దకే ప్రభుత్వ సేవలు అందడమే కాకుండా, అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, అవినీతిరహితంగా అందించడం జరుగుతోందన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రజలకు మంచి చేశాం కాబట్టి ధైర్యంగా ప్రజల ముందుకు వచ్చి చెబుతున్నామని, టీడీపీ నాయకులు అధికారంలో ఉన్నప్పుడు ఏంచేశారో చెప్పే దమ్ముందా అని ప్రశ్నించారు. 2014 ఎన్నికల్లో 600 అబద్ధపు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఒకటీ నెరవేర్చలేదని, ఇప్పుడు 2024 ఎన్నికల్లో ఎలాగైనా అధికారంలోకి రావాలనే దుర్బుద్ధితో ప్యాకేజీస్టార్ పవన్‌కల్యాణ్‌తో కలిసి మాయమాటలతో మోసగించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. మేనిఫెస్టోలోని హామీలను 100శాతం అమలుచేసిన మొదటి ముఖ్యమంత్రిగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఘనత పొందారన్నారు. రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమం కలకాలం కొనసాగాలంటే ప్రజలు వైఎస్సార్ సీపీ ఫ్యాన్‌గుర్తుపై ఓటువేసి, మనందరి నాయకుడు జగనన్నను ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచులు సాలమ్మ, బుక్యారాజేశ్వరి, బండిశశికళ, ఈశ్వరయ్య, ఫాతిమాబీ, సిద్ధలదీపా, ఎంపీటీసీలు సుబ్బలక్ష్మీ, బాణావత్ విజయకుమారి, నందినితాజ్, నీరుగట్టిమేరీ, సచివాలయ కన్వీనర్ దండుకరుణాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ దండుకృష్ణారెడ్డి, మార్కెట్‌కమిటీ చైర్మన్ తట్టిశ్రీనివాసులురెడ్డి, నారాయణస్వామి, బండిమనోహర్, గౌడసానివెంకటరమణ, రాము, మల్లికార్జున, జేసీఎస్ కన్వీనర్ పోతబోలునాగరాజు, ఇస్మాయిల్, సిద్ధలవేమారెడ్డి, నీరుగట్టిరమణ, ఆర్‌బీకే చైర్మన్ కత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న లేఅవుట్లలో సర్వే త్వరగా పూర్తి చేయండి

పీలేరు రూరల్ : మండలంలోని జగనన్న లేఅవుట్లలో రెండు రోజుల్లోపు సర్వే పూర్తి చేయాలని తహసీల్దార్ ధనుంజయులు అన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, విలేజ్ సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. జగనన్న లేఅవుట్లలో అక్రమాలు జరిగినట్లు వచ్చిన ఫిర్యాదులతో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జగనన్న లేఅవుట్లలో ఎన్ని ఇళ్లు మంజూరు చేశాం, ఎంత మంది లబ్ధిదారులు ఉన్నామో గుర్తించి ప్రతి లేఅవుట్‌లో ఖాళీలు గుర్తించి ఇప్పటి వరకు పట్టాలు పంపిణీ చేయని లబ్ధిదారులకు ఆయా గ్రామ సచివాలయాల్లో పట్టాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. నివేదిక తయారు చేసి కలెక్టర్‌కు పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో డీటీలు లోకేశ్వర్‌రెడ్డి, సుబ్రమణ్యం, ఆర్‌ఐ చాణక్య, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

అల్లా మార్గమే సన్మార్గం



మసీదు ప్రారంభోత్సవంలో మత పెద్దలతో ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: అల్లా చూపిన సన్మార్గంలో ప్రతి ముస్లిం నడవాలని ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి ఆకాంక్షించారు. సోమవారం స్థానిక బైపాస్‌రోడ్డులో నూతనంగా నిర్మించిన మస్జిద్-ఏ-ఖాదీర్ మసీదును ప్రార్థనలతో ప్రారంభించారు. మత పెద్దలు మాసుమ్ ముఫ్తీ సాహెబ్, మసీవుల్లా మౌలానాలు భక్తిశ్రద్ధలతో దువా చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను ముస్లిం పెద్దలు శాలువతో సత్కరించారు. మసీదు నిర్మాణం గురించి తెలుసుకున్నాక..ఆయన మాట్లాడుతూ ఇస్లాం మతం అందరిపట్ల ప్రేమ, దయ, దానగుణం, శాంతి, సౌభ్రాతృత్వం పాటిస్తుందన్నారు. అన్ని మతాలు ఇవే చెబుతాయని, మానవత్వం తర్వాతే ఏదైనా అని అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పాగొండ ఖలీల్, మాజీ సర్పంచు నాగరాజు, పెద్దలు షాకీరా అహ్మద్, ఇలియాజ్, ఎహసానుల్లా, అయాబ్‌ఖాన్, జమాలుద్దీన్, మోదీన్‌సాబ్, నాసర్, తకీవుల్లా బాషా, తాజ్‌బాషా, గయాజ్‌వలీ పాల్గొన్నారు.

మా కోసం కాదు..ప్రజల కోసం పని చేయండి

ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి



ప్రజా సమస్యలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి

పెద్దతిప్పసముద్రం: ప్రజలంతా మాపై నమ్మకంతో ఓట్లు వేసి గెలిపించారు. మీరు మా కోసం కాకుండా ప్రజల కోసం పని చేయాలని తంబళ్ళపల్లి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ్‌రెడ్డి విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న పలు శాఖల అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం గడప, గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా సంపతికోట, మల్లెల పంచాయతీల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ, ప్రజా సమస్యలను ఆలకిస్తూ వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడుతూ ముందుకు సాగారు. ఇంకా అర్హులై పథకాలు అందని లబ్ధిదారులు ఉంటే తన దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. అడుగడుగునా ప్రజలంతా ఎమ్మెల్యేకు హారతులు పట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా నియోజక వర్గం అన్ని విధాలా అభివృద్ధి చెందిందన్నారు. ఇలాంటి సంక్షేమ పాలన, పథకాలు కొనసాగాలంటే మళ్ళీ జగనన్న ప్రభుత్వాన్ని మీరంతా ఆశీర్వదించాలని కోరారు. జిల్లా, మండల, గ్రామ స్థాయి ప్రజా ప్రతినిధులు, నాయకులు గణపతిరెడ్డి, మహమూద్, శివన్న, డ్రిప్ రమణ, కుమార్‌రెడ్డి, సమర శంకర్, సుబ్బరాం, చెన్నకేశవరెడ్డి, రెడ్డెప్ప, మధు, కుంచే శీనూ, రఘు, రాఘవ, ఉమా శంకర్, రమణ, రవీంద్రారెడ్డి, కిట్టన్న, వెంకట్, ఏకేఆర్, మంజునాథ్‌రెడ్డి, రామచంద్రారెడి, ఆనందరెడ్డి, రియాసత్ అలీఖాన్, బసిరెడ్డి, సందీప్ రెడ్డి, చక్రవర్తి, చంద్రారెడ్డి, అధికారులు విద్యాసాగర్, గిరిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన

– ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



సంక్షేమ లబ్ధి బ్రోచర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల

వాల్మీకిపురం: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మంచూరు పంచాయతీ పెరుమల్లయ్యగారిపల్లి, శాఖంవారిపల్లి హరిజనవాడలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా గడప గడపకు వెళ్లి ఆయా కుటుంబాలకు చేరిన లబ్ధిని వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతల మాట్లాడుతూ సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించటమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా నగదును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తున్నారన్నారు. సీఎంకు అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు అన్నారు. అర్హులైన అందరికీ నవరత్నాల పథకాలు అందుతున్నాయన్నారు. అర్హత ఉండి పథకాలు రాని వారు ఉంటే వలంటీర్లు, సచివాలయ సిబ్బందిని సంప్రదిస్తే సమస్యలను పరిష్కరిస్తారన్నారు. జగనన్న సురక్ష పథకాన్ని ఉపయోగించుకొని వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థలతో ప్రజలు కార్యాలయాల చుట్టూ తిరగకుండా అక్కడికక్కడే నిర్ణీత గడువులో అన్ని సేవలు అందుతాయన్నారు. సచివాలయ వ్యవస్థ దేశానికే దక్కుతుందన్నారు. ఆర్థికంగా ప్రతి ఒక్కరూ బాగుండాలనే లక్ష్యంతో ఇచ్చిన మాట ప్రకారం సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి వైఎస్సార్ రైతు భరోసా, ఆసరా, జగనన్న విద్యాదీవెన, అమ్మ ఒడి తదితర పథకాలు అమలు చేస్తున్నారన్నారు. అర్హత కలిగిన ప్రతి పేదకు సంక్షేమ పథకాలు అందజేయాలన్న లక్ష్యంగా ముందుకు సాగుతున్నామన్నారు. సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలేకాక ఇవ్వనివీ అమలు చేశారన్నారు. కార్యక్రమంలో నాయకులు శంకర్ రెడ్డి, నాగరాజ, చిన్నా, రామనాథం, నారాయణ రెడ్డి, రాజా రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, వెంకటస్వామి రెడ్డి, ప్రదీప్, యుగంధర్, బాబు, దొరస్వామి నాయుడు, ఆదిరెడ్డి, కేశవ రెడ్డి, రాయుడు, ఆనంద, వివిధశాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

‘జగనన్నకు చెబుదాం’ సమస్యలకు పరిష్కారం



ఆర్డీఓ మురళికి అర్జీ సమర్పిస్తున్న బహుజనసేన నాయకుడు

మదనపల్లె : ‘జగనన్నకు చెబుదాం’ కార్యక్రమంలో డివిజన్ పరిధిలో ప్రజలు సమర్పించిన అర్జీలకు సత్వర పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మదనపల్లె మండలంలోని చిలకవారిపల్లెలో దళితులపై దాడికి పాల్పడ్డ ఘటనలో నమోదైన ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ కేసులో నిందితులను తక్షణం అరెస్ట్ చేసి వారికి న్యాయం చేయాలని బహుజనసేన రాష్ట్ర అధ్యక్షులు శ్రీచందు ఆర్డీఓ ఎం.ఎస్.మురళీకి వినతిపత్రం సమర్పించారు. దళితులకు కేటాయించిన భూమిని తిరిగి వారికి అందించాలని కోరారు. అనుభవంలోని భూమికి పట్టా కావాలని రామసముద్రం తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకుంటే... గ్రామానికి చెందిన శమకలపల్లె నారాయణ అడ్డుపడుతూ భూమిలోకి అడుగుపెట్టనీయనని దౌర్జన్యం చేస్తున్నాడని చొక్కాండ్లపల్లె పంచాయతీ కసగానికి చెందిన ఎం.వెంకటరమణ అర్జీ సమర్పించాడు. తమ భూమికి నారాయణకు ఎలాంటి సంబంధం లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. అగ్రికల్చర్ భూమిని కమర్షియల్ భూమిగా మార్పుచేసేందుకు ప్రభుత్వానికి చలానా, రుసుములు చెల్లించినప్పటికీ రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం కనపరుస్తున్నారని పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన డాక్టర్.పి.కిరణ్ అర్జీ సమర్పించారు. మున్సిపాలిటీలో జరిగిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో చేనేతనగర్‌లో వీధిదీపాలు వెలగడం లేదని, గొల్లపల్లె శివాజీనగర్‌లో నీటిసమస్య అధికంగా ఉందని, తమ స్థలంలో కొళాయి తవ్వేశారని బాధితులు ఫిర్యాదు చేశారు.

కలకడ విద్యార్థికి కౌండిన్య స్కాలర్‌షిప్



డాక్టర్ ఈ.వి.నారాయణ చేతుల మీదుగా ప్రశంస పత్రం అందుకుంటున్న సందీప్‌కుమార్

కలకడ : మండలంలోని కదిరాయచెర్వు ప్రభుత్వ జిల్లాపరిత్ ఉన్నత పాఠశాల విద్యార్థి (గౌరవం నాగమణి, చలమయ్య గౌడ్‌ల కుమారుడు) సందీప్‌కుమార్‌కు కౌండిన్య ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ద్వారా ఉత్తమ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు అందించే స్కాలర్‌షిప్‌ను అందించినట్లు మండల విద్యాశాఖాధికారి మునీంద్రనాయక్ తెలిపారు. సోమవారం గుంటూరులో జరిగిన కార్యక్రమంలో ఆ సంస్థ ఫౌండర్, చైర్మన్ డాక్టర్ ఈ.వి.నారాయణ చేతుల మీదుగా విద్యార్థికి ప్రశంసపత్రంతో పాటు నగదు బహుమతి రూ. 5116 అందజేసినట్లు తెలిపారు. శ్రీకాకుళంలోని ట్రిపుల్ ఐటిలో పీయూసీ ద్వితీయ సంవత్సరం కొనసాగిస్తున్న సందీప్ కుమార్ కౌండిన్య స్కాలర్‌షిప్‌కు ఎంపిక కావడం గొప్ప విషయమన్నారు.

ఎస్టీయూ మదనపల్లె నూతన కార్యవర్గం



ఖాదర్‌బాషా



ఖాజాఅలీ



ఏ.శ్రీనివాసులురెడ్డి



సోమేపల్లె శ్రీనివాసులు

జిల్లా కార్యదర్శులుగా ..

మదనపల్లె : పట్టణ ఎస్టీయూ నూతనకార్యవర్గం ఏర్పాటైంది. స్థానిక కోటవీధిలోని హోప్ మున్సిపల్ హైస్కూల్‌లో సోమవారం ఎస్టీయూ రాష్ట్ర కార్యదర్శి పి.మధుసూధన ఎన్నికల అధికారిగా, రాష్ట్ర కౌన్సిలర్ ఆర్.వి. ఎన్నికల పరిశీలకులుగా పట్టణశాఖ కార్యవర్గ ఎంపిక జరిగింది. సమావేశంలో వివేకానంద మున్సిపల్ హైస్కూల్, మాయాబజార్‌లో గణితం స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కే.ఖాదర్‌బాషాను పట్టణ అధ్యక్షులుగా, వివేకానంద మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీగా పనిచేస్తున్న డి.ఖాజాఅలీని ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకున్నారు.

జిల్లా కార్యవర్గంలో చోటు

పెద్దతిప్పసముద్రం: ఎస్టీయూ జిల్లా కార్యవర్గ ఎన్నికలో మండలానికి చెందిన ముగ్గురికి చోటు దక్కిందని అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వెంకటేష్, శ్రీనివాసులు తెలిపారు. సోమవారం వారు మాట్లాడుతూ జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శిగా రామక్రిష్ణ, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా లక్ష్మీనారాయణ, స్టేట్ కౌన్సిలర్‌గా అశోక్‌రెడ్డిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

నిమ్మనపల్లె : ఎస్టీయూ జిల్లా కార్యదర్శిగా ఏ.శ్రీనివాసులురెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా సోమేపల్లె శ్రీనివాసులు ఎన్నికయ్యారు. మదనపల్లెలో జరిగిన ఎస్టీయూ 77వ వార్షిక కౌన్సిల్ సమావేశంలో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యవర్గంలో కురప్పల్లె పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఏ.శ్రీనివాసులురెడ్డిని జిల్లా కార్యదర్శిగా, వెంకోజీపల్లె ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సోమేపల్లె శ్రీనివాసులును కార్యనిర్వాహక కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు.

కలకడ మండల శాఖ ఏకగ్రీవం

కలకడ : మండల ఎస్టీయూ శాఖ అధ్యక్షుడిగా ముడియంవారిపల్లె ప్రభుత్వ ప్రాథమి కోన్నత పాఠశాల ఉపాధ్యాయులు పి.శ్రీనివాసరావ్‌ను ఏకగ్రీవంగా ఎంపిక చేసినట్లు ఈ శాఖ జిల్లా అధ్యక్షుడు అంకమరెడ్డిశివారెడ్డి తెలిపారు. మండలశాఖ కార్యదర్శిగా బి.వెంకటేశ్వరరావ్, జిల్లా కౌన్సిలర్‌గా సధాశివరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడిగా బాబురెడ్డి, రాష్ట్ర కౌన్సిలర్‌గా వైవి రమణ ఎంపికైనట్లు తెలిపారు.

సంక్షేమ పథకాలతో సామాజిక విప్లవం



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న అధికారులు

పీలేరు రూరల్ : ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో సామాజిక విప్లవం తీసుకొచ్చారని రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అబ్దుల్ కలీమ్ అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆడుదాం ఆంధ్ర, వికసిత్ భారత్ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా, వైద్య, రంగాల్లో నిర్మాణాత్మకమైన కార్యక్రమాలు చేపట్టారన్నారు. పీలేరు నియోజకవర్గంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ మిథున్‌రెడ్డి, ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు పరుగులు పెట్టిస్తున్నారని తెలిపారు. ఎంపీడీవో మురళీమోహన్‌రెడ్డి మాట్లాడుతూ మండల స్థాయి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈవోలు లోకేశ్వర్‌రెడ్డి, పద్మావతి, ఈవోపీఆర్‌డీ జయమ్మ, సూపరింటెండెంట్ సతీష్‌రెడ్డి పాల్గొన్నారు.

నేరస్తుల ప్రవర్తనలో మార్పు రావాలి



పాత నేరస్తులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ మోహన్‌రెడ్డి

పీలేరు రూరల్: పాత నేరస్తుల ప్రవర్తనలో మార్పు రావాలని సీఐ మోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని వివిధ కేసుల్లో ఉన్న పాత నేరస్తులను తహశీల్దార్ కార్యాలయంలో బైండోవర్ చేశారు. అనంతరం స్థానిక సర్కిల్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ఇచ్చారు. సీఐ మాట్లాడుతూ గ్రామాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంత జీవనం సాగించాలన్నారు.